


నిరసన వారాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల నిర్మూలనతో పాటు ప్రభుత్వం చెల్లించాల్సిన వివిధ రకాల బకాయిలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 11 నుంచి జరగనున్న నిరసన వారోత్సవంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు పిలుపునిచ్చారు. ఉద్యోగ ఉపాధ్యాయులను చైతన్యపరిచేందుకై మండలంలోని పెద్దేవం ఉన్నత పాఠశాలలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 15 నెలలు గడిచిందన్నారు. కాని నేటికీ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు.

ముందే స్థానిక సమరం


- కసరత్తులు ప్రారంభించిన ఈసీ
- సిద్ధమవుతున్న ఆశావహులు
- వచ్చే నెల 15లోగా వార్డుల పునర్విభజన
- నవంబర్ 15లోగా ఓటర్ల జాబితా

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మూడు నెలల ముందే స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధపడుతోంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ప్రీ ఎలక్షన్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. 2026 జనవరిలో పంచాయతీ ఎన్నికలు, జులై నుంచి ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలకు ఏర్పాట్లు చేసుకోవాలని ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. అనుకున్న దానికంటే మూడు నెలల ముందుగానే పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయనే సంకేతాలు రావడంతో గ్రామాల్లో అప్పుడే ఎన్నికల సందడి మొదలైంది. సర్పంచ్ స్థానాలకు పోటీ చేసే ఆశావహులు పావులు కదపడం మొదలుపెట్టారు. వచ్చే ఏడాది జనవరిలోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, ఎన్నికల నిర్వహణ అదే రోజు ఫలితాలను వెల్లడించేందుకు ఎన్నికల సంఘం సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది అక్టోబర్ 15లోగా వార్డుల పునర్విభజన, డిసెంబరు 15లోగా రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఈసీ ఆదేశాలు ఇచ్చింది. నవంబర్ 15లోగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని, 30లోగా పోలింగ్ కేంద్రాలను ఖరారు చేయాలని యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చింది.

ఉత్సాహంగా ఆశావహులు

సాధారణ సమయానికంటే మూడు నెలలు ముందుగానే ఎన్నికలు జరపనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ఆశావహులు ఉత్సాహంగా కనిపిస్తున్నారు. తొలిత పంచాయతీ ఎన్నికలు జరగనుండడంతో ఆయా గ్రామాల్లో ఇప్పుడిప్పుడే రాజకీయ వాతావరణం వేడెక్కుతుంది. గ్రామ సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనుండడంతో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు ఇప్పటి నుంచే ప్రయత్నాలను చేస్తున్నారు. ఆయా పంచాయతీలకు రిజర్వేషన్లు ఖరారు కావలసి ఉంది. ఈ నేపథ్యంలో తమకు అనుకూలంగా రిజర్వేషన్లు వస్తాయని భావిస్తున్న పలువురు తమ ప్రయత్నాల్లో కొనసాగుతున్నారు. ఎలాగైనా గ్రామపంచాయతీలో పట్టు సాధించాలని తాపత్రయంతో సాగుతున్నారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా ముందున్నామంటూ సంకేతాలు ఇస్తున్నారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. తమకే అవకాశం ఇవ్వాలంటూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. గతం కంటే భిన్నంగా గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపిస్తామంటూ హామీలను సైతం ఇస్తున్నారు. కులాలు, వర్గాల వారీగా కలుస్తూ తమ తమ ప్రతిపాదనను వాళ్ళ ముందు ఉంచుతున్నారు. కూటమి



ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో టిడిపి, జనసేన ముఖ్య నేతలు చుట్టూ తిరుగుతున్నారు. పంచాయతీల్లో పట్టు కోసం ఆశావాహులు చేయని ప్రయత్నం అంటూ లేదు.

గతంలో ఇలా...

2021 ఫిబ్రవరి 8న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1103 పంచాయతీలకు నాలుగు దశల్లో ఎన్నికలు జరిగాయి. తొలి దశలో కాకినాడ, పెద్దాపురం డివిజన్లలో నిర్వహించారు. కాకినాడ డివిజన్లో 140 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నోటిఫై చేయగా, 13 స్థానాలకు ఎన్నిక ఏకగ్రీవయ్యాయి. మిగిలిన 127 స్థానాలకు 345 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 1622 వార్డు సభ్యుల స్థానాలకు, 430 స్థానాలకు ఎన్నిక ఏకగ్రీవం కాగా మిగిలిన 1191 స్థానాలకు 2,650 మంది అభ్యర్థులు అప్పట్లో పోటీలో నిలిచారు. పెద్దాపురం డివిజన్ పరిధిలో 226 సర్పంచ్ స్థానాలకు గానూ 17స్థానాలకు ఎన్నిక ఏకగ్రీవం కాగా, మిగిలిన 209 స్థానాలకు 571 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. 2478 వార్డు సభ్యుల స్థానాలకు, 396 స్థానాలు ఏకగ్రీవమై మిగిలిన 2,082 స్థానాలకు 4704 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మొత్తంగా 336 సర్పంచ్ స్థానాలకు 916 మంది సర్పంచ్ అభ్యర్థులు, 3,273 వార్డు సభ్యుల స్థానాలకు 7,354 మంది అభ్యర్థులు పోటీ చేశారు.

ఎంపిటిసి, జడ్‌పిటిసి స్థానాలకు 2021 ఏప్రిల్ 8న ఎన్నికలు పూర్తయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 3,561 పోలింగ్ కేంద్రాల్లో 61 జెడ్పిటిసీ స్థానాలు, 999 ఎంపిటిసి స్థానాలకు జరిగిన ఎన్నికలలో 64.05 శాతం పోలింగ్ నమోదయింది. మొత్తం 29,97,485 మంది ఓటర్లుండగా 19,19,961 మంది తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. అయితే కోర్ట్ ఆదేశాల మేరకు అప్పట్లో ఫలితాల వెల్లడి బాగా ఆలస్యం అయింది. దింతో 2021 సెప్టెంబరు 19న ఓట్లు ఫలితాలు వెల్లడయ్యాయి. 82 ఎంపిటిసి స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. వీటిలో వైసిపి 77 స్థానాల్లో, జనసేన, ఇండిపెండెంట్ అభ్యర్థులు రెండేసి స్థానాల్లో, టిడిపి ఒక స్థానంలో ఏకగ్రీవమయింది. వివిధ కారణాలతో రాజమహేంద్రవరం రూరల్ జడ్‌పిటిసి స్థానానికి, 5 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరగలేదు. 234 జడ్‌పిటిసి అభ్యర్థులు, 2,620 ఎంపిటిసి అభ్యర్థులు పోటీలో నిలిచారు. 17,91,531 ఎంపిటిసి ఓట్లు, 19,23,295 జడ్‌పిటిసి ఓట్లు లెక్కింపు జరిపారు. ఇప్పుడు జిల్లాల విభజన జరగడంతో ఆయా జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణలో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గోకవరం

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ ఆధ్వర్యంలో మంగళవారం యుటిఎఫ్ నాయకులు మండలంలో పలు ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రపంచ బ్యాంకు సాల్ట్ పథకం అమలు పేరుతో మూడో వంతు ప్రైమరీ స్కూళ్లు ఇప్పటికీ సింగిల్ టీచర్ స్కూలుగా మారిపోయాయన్నారు. హై స్కూల్లో పని చేయాల్సిన స్కూల్ అసిస్టెంట్లు సర్ప్లస్ పేరుతో క్లస్టర్ టీచర్లుగా, ప్రైమరీ స్కూల్ హెచ్ఎంలుగా పని చేయాల్సిన పరిస్థితి కల్పించారన్నారు. బోధ నేతర కార్యక్రమాలు చుట్టూ ఉపాధ్యాయులను ఊపిరి ఆడకుండా చేస్తున్నారన్నారు. విద్యార్థులకు అక్షరాలు చెప్పాలనే విధంగా కాకుండా అన్‌లోడ్ అప్‌లోడ్ కార్యక్రమంగా విద్యా శక్తి కార్యక్రమాన్ని మార్చేశారన్నారు. స్వచ్ఛందం అంటూనే ఉపాధ్యాయులను బలవంతంగా నిర్బంధిస్తున్నారన్నారు. ఇక పరీక్షల మూల్యాంకనాన్ని ఉపాధ్యాయులకే పరీక్షగా మార్చేశారన్నారు. ప్రతి సమాచారం ఆన్‌లైన్ చేయాలంటూ అధికారుల ఒత్తిడి పెరిగిందన్నారు. 12వ పిఆర్‌సి కమిషనర్ రాజీనామా చేసి 15 నెలలైనా నేటికీ మరొకరిని నియమించలేదన్నారు. సిపిఎస్ రద్దుకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక సమస్యలతో పాటు విద్యారంగ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, ఉపాధ్యాయులు స్వేచ్ఛాయుత వాతావరణంలో బోధనపై కేంద్రీకరించే పరిస్థితులను కల్పించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఉద్యమిస్తుందన్నారు. ఈ నెల 15 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జాతాలు పర్యటిస్తున్నాయన్నారు. సెప్టెంబర్ 25న విజయవాడలో వేలాది మందితో బహిరంగ సభ నిర్వహించి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి అల్టిమేట్ ఇవ్వడం ద్వారా రణభేరి మోగించాలని నిర్ణయించిందన్నారు. ఉపాధ్యాయులు దీనికి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరనాథ్, పంతం త్రిమూర్తులు, జిల్లా కార్యదర్శి కె.నాగభూషణం, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.ప్రేమ్‌కుమార్, మండల బాధ్యులు సతీష్, కృష్ణార్జునుడు, బాలు దొర, ప్రకాష్ రావు పాల్గొన్నారు.

నిడదవోలు : ఆర్థిక, విద్యారంగ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక డొక్కా సీతమ్మ, మున్సిపల్ హైస్కూల్‌లో రణభేరి పోస్టరును ఆవిష్కరించారు. ఈ నెల 15 నుంచి 19 వరకూ జరిగే వివిధ కార్యక్రమాల వరుసలో భాగంగా రణభేరి పోస్టరును జిల్లా అధ్యక్షులు పి.జయకర్, జిల్లా కార్యదర్శులు, మండల అద్యక్ష ప్రధాన కార్యదర్శి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి.జయకర్ మాట్లాడుతూ ఐదు ప్రాంతాలనుండి రణభేరి జాతాలు మొదలవుతాయన్నరు. అన్ని ప్రాంతాల నుంచి ఈ జాతాలు పర్యటిస్తాయన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని, పాఠశాలలో ఒత్తిడి లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అయినాల శ్రీనివాసరావు, కార్యదర్శి కె.ప్రదీప్ కుమార్, గౌరవ అధ్యక్షులు ఆకాసపు శ్రీనివాసరావు, ట్రెజరర్ జి.శివకుమార్, కరుణ్, మేక శ్రీనివాసరావు, శ్రీరామ్, రమేష్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి'లో బయటపడ్డ అవినీతి

ప్రజాశక్తి - రాజానగరం

2024-25 ఆర్థిక సంవత్సరానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల్లో భారీ అవినీతి సామాజిక తనిఖీల్లో బయటపడింది. ఈనెల 6న ఎంపిపి మండారపు సీతారత్నం అధ్యక్షతన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. దీనిలో 1,375 పనులకు రూ.12,03,21,228 నిధులు ఖర్చు చేశారు. దీనిలో 96 సిసి రోడ్లకు రూ.5,93,79,841, 10 డ్రెయినేజీల నిర్మాణానికి రూ.4,52,344 ఖర్చు పెట్టినట్లు రికార్డుల్లో చూపించారు. తనిఖీల్లో రూ.2,43,223 రికవరీ చేశారు. 96 సిసి రోడ్లు పూర్తిగా నిర్మించకుండా రికార్డుల్లో చేసినట్లుగా నమోదు చేసి సుమారు రూ. 2 కోట్ల వరకు గోల్ మాల్ జరిగిందని విమర్శలు వస్తున్నాయి. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదుచేస్తామని కొందరు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఫిర్యాదు చేయకుండా రూ.12 లక్షలు ఇస్తామని నాయకులతో అధికారులు అనధికార ఒప్పందం కుదుర్చుకున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరపాలని పలువు కోరుకుంటున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముప్పిడి శ్రీను మాట్లాడుతూ రోడ్ల పనుల్లో కూటమి నాయకులకు, అధికారులకు భారీగా డబ్బులు ఒప్పందం జరిగిందన్నారు. దీనిపై కమిటీ వేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జె. సుత్తిబాబు మాట్లాడుతూ అధికారులు, కూటమి నాయకులు ప్రజా ధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. నిధులు దుర్వినియోగంపై అఖిలపక్షతో కమిటీ వేసి విచారణ చేయాలన్నారు. ఎపిఒను వివరణ కోరగా సిసి నిర్మాణాలన్నీ నిబంధనలు ప్రకారం జరిగిందన్నారు. ప్రతి రోడ్డు జియో ట్యాగ్ జరుగుతుందని అవినీతికి చోటుండదని చెప్పారు.

యూరియా కొరతపై అన్నదాత పోరు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

తక్షణం యూరియా కొరతను నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రైతులను, పంటలను కాపాడాలని వైసిపి ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమాన్ని మంగళవారంనిర్వహించింది. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున ర్యాలీగా వెళుతున్న వైసిపి శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నాయకులు రోడ్డుపైనే బైఠాయించి ఆందోళనకు దిగారు. వైసిపి జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకిష్ణ, వైసిపి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా, రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ నాయకత్వంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ..రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో యూరియా కోసం



కొవ్వూరులో నిరసన తెలుపుతన్న వైసిపి శ్రేణులు

రైతులు అష్టకష్టాలు పడుతున్నారన్నారు.వైసిపి హయాంలో రైతులకు ఎక్కడా చిన్న సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకున్నామని వివరించారు. రైతు భరోసా సొమ్ము మొదలుకొని సీజన్ ముగిసేలోపే పంట నష్టపరిహారం అందించామని, క్రాప్ ఇన్సూరెన్స్ ప్రభుత్వమే కట్టి రైతులకు అందించామన్నారు. తక్షణం యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేశారు.

నియంత పాలన సాగిస్తున్న కూటమి

కొవ్వూరు : రాష్ట్రంలో యూరియా దొరక్క రైతులు ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు బెదిరింపులకు పాల్పడుతూ నియంత పాలన సాగిస్తున్నారని మాజీ హోం మంత్రి తానేటి వనిత అన్నారు. వైసిపి చేపట్టిన అన్నదాత పోరుబాట కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మంగళవారం మెరకవీధి వాటర్ ట్యాంక్ దగ్గర నుంచి ఆర్‌డిఒకార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ ప్రజా సమస్యలపై గళం విప్పుతున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. యూరియా దొరక్క రైతులు అవస్థలు పడుతుంటే, బ్లాక్ మార్కెట్లో విక్రయాలు కొనసాగుతుంటే కొరత లేదంటూ ప్రభుత్వం బుకాయిస్తుందన్నారు. వైసిపి కొవ్వూరు నియోజకవర్గ ఇన్చార్జి తలారి వెంకట్రావు మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో రైతు సంక్షేమమే ధ్యేయంగా



రాజమహేంద్రవరంలో రోడ్డుపై బైటాయించిన నాయకులు

పనిచేసిందన్నారు. ఆర్‌బికెల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు అందించామన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో ఏ పంటకు గిట్టుబాటు ధర లభించట్లేదన్నారు. దెబ్బతిన్న పంటలకు సకాలంలో ఇన్పుట్ సబ్సిడీ అందడం లేదని ఆరోపించారు. యూరియా కొరత తీర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నిడదవోలు వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ జి శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ రైతుల ఇబ్బందులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తలారి వెంకట్రావు యూరియా బస్తా మోసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్‌డిఒకు వినతిపత్రం సమర్పించారు. వైసిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంటమణి రమేష్ బాబు, ఇళ్ల భాస్కరరావు, జుట్ట ఏడుకొండలు, పరిమి సోమరాజు, ఉప్పులూరి సూరిబాబు, వెంపాటి సురేష్ కుమార్, సుంకర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'నానో'పై అవగాహన అవసరం

ప్రజాశక్తి -దేవరపల్లి

జిల్లాలో యూరియా సరఫరా సమద్ధిగా ఉన్నప్పటికీ, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు ఇచ్చే నానో యూరియా వినియోగంపై రైతులు దృష్టి పెట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. మంగళవారం గౌరీపట్నం ప్యాక్ సొసైటీని కలెక్టర్ సందర్శించారు. యూరియా సరఫరా, వినియోగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అవగాహన కల్పించే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు రైతు సేవా కేంద్రాలు, సహకార పరపతి సంఘాలు, ప్రైవేట్ డీలర్ల ద్వారా మొత్తం 23,129 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగిందన్నారు. గతేడాది ఇదే కాలానికి 19 వేల మెట్రిక్ టన్నులు విక్రయించగా, ఈసారి మరింత పెరిగిందని తెలిపారు. అదనంగా మరో 2,600 మెట్రిక్ టన్నులు నిల్వ ఉందన్నారు. దేవరపల్లి మండలంలో గతేడాది ఖరీఫ్‌లో 1,799 మెట్రిక్ టన్నులు సరఫరా కాగా, ప్రస్తుత ఇప్పటివరకు 1,500 మెట్రిక్ టన్నుల విక్రయాలు జరిగాయన్నారు. అక్టోబర్ వరకు యూరియా వినియోగం కొనసాగుతుందని, ఆ మేరకు దశలవారీగా సరఫరా చేస్తామన్నారు. నానో యూరియాతో పంటల ఉత్పాదకత పెరగడమే కాక భూమి సారాన్ని కాపాడుతుందని, తక్కువ మోతాదులో ఎక్కువ ఫలితాలు ఇస్తుందని, రైతులకు ఖర్చు తగ్గింపుని కలిగిస్తుందని కలెక్టర్ వివరించారు. రైతులు తొందరపడి అదనపు నిల్వలు చేయకుండా అవసరానికి అనుగుణంగా మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు.



మొక్కలు నాటుతున్న తిరుమల విద్యార్థులు

తిరుమలలో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం రూరల్ కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ఆధ్వర్యంలో గామన్ బ్రిడ్జి నుంచి వెంకటనగరం మధ్య గల ఆర్ అండ్ బి రోడ్డు డివైడర్ లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంస్థ ఛైర్మన్ నున్న తిరుమలరావు మాట్లాడుతూ కాలుష్య నివారణ, స్వచ్ఛమైన గాలి చెట్లతోనే సాధ్యమవుతుందన్నారు. భూమిని కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. పచ్చదనం పెంపు కోసం మొక్కలు పెంచాలన్నారు. తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజిని దేవి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజూ చూసే ఈ పచ్చని వాతావరణం వారిలో పర్యావరణంపై ప్రేమను పెంచుతుందన్నారు. డివైడర్‌పై పచ్చదనం పెరగడంతో రహదారి అందంగా మారడమే కాకుండా, పర్యావరణానికి మేలు చేకూరుతుందని అన్నారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవడం అనేది చిన్నప్పటి నుంచే అలవాటుగా ఉండాలని ఈ కార్యక్రమంలో చిన్న పిల్లలతో మొక్కలు నాటించామని అన్నారు. అనంతరం తిరుమలరావు, సరోజినీ దేవి దంపతులు మరియు వారి కుమార్తె రష్మి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ నిర్మూలన ఉద్యమకారిణి, ఆంధ్ర రాష్ట్ర స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు గ్రహీత జి.వనజ, తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కొవ్వూరు

ఈనెల 13న కొవ్వూరులో నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి జివిఎల్.సరస్వతి కోరారు. మంగళవారం కోర్ట్ హాల్లో పోలీస్ అధికారులతో ఆమె సమేవేశం నిర్వహించారు. కొవ్వూరు కోర్టుల్లో ఎన్ని కేసులు పెండింగ్ ఉన్నాయి, ఎన్ని కేసులు రాజీకి వచ్చేవో గుర్తించారు. ఎక్కువ కేసులు రాజీమార్గ ద్వారా పరిష్కరించుకునే విధంగా పోలీస్ అధికారులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కోర్టులో ఉన్న పెండింగ్ కేసులు తగ్గించేందుకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, 2 క్లాస్ మేజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి, డిఎస్‌పి జి.దేవకుమార్, పట్టణ, రూరల్ సిఐలు పి.విశ్వం, కె.విజయ్‌బాబు, సబ్ స్టేషన్ పరిధిలోని పలువురు పోలీస్ అధికారులు కోర్ట్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

యూరియా నిల్వల తనిఖీ

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరం తహశీల్దార్ కార్యాలయన్ని మంగళవారం రాజమహేంద్రవరం రెవిన్యూ డివిజన్ అధికారి అర్.కృష్ణనాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా రెవిన్యూ సిబ్బందితో తహశీల్దార్ కార్యాలయంలో చేస్తున్న సేవలపై అరా తీసి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం గోకవరం సొసైటీకి వెళ్లి గొడౌన్లలో ఉన్న యూరియా నిల్వలును తనిఖీ చేశారు. యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులుకు ఆదేశించారు. ఆయన వెంట గోకవరం తహశీల్దార్ రామకృష్ణ, సొసైటీ సిఇఒ డి.సురేష్, సిబ్బంది ఉన్నారు.

బాషాలిమ్రా ఎంపికపై పలువురి హర్షం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

జనసేన పార్టీ నగర ప్రధాన కార్యదర్శి షేక్ బాషాలిమ్రాను రాష్ట్ర నూర్ భాషా కార్పొరేషన్ డైరెక్టర్‌గా కూటమి ప్రభుత్వం నియమించింది. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన క్రియాశీలక కార్యకర్తల్లో ఒకరిగా ఉన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నూర్ భాషా సంఘం యువజన విభాగానికి అధ్యక్షులుగా కూడా పని చేశారు. ఈ సందర్భంలో తనకు రాష్ట్ర ముఖ్యమంత్రి లినారా చంద్రబాబు నాయుడు,లి జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి లిపవన్ కళ్యాణ్‌లి కల్పించిన పదవికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఎంపిక పట్ల పలువురు నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

కార్టూ'నిజం'



ఉపాధి కల్పించాలని ఆటో కార్మికుల నిరసన

ప్రజాశక్తి - కొవ్వూరు

ఉచిత బస్సు పథకం తమ ఉపాధిని గండి కొట్టిందని ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐపంగిడిలో ్మంలో ఆటో కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కాపవరం ఐపంగిడి, గోవర్ధనగిరి మెట్ట తదితర ప్రాంతాలకు చెందిన వంద లాది మంది కార్మికులు ఐపంగిడి ప్రధాన కూడలిలో ధర్నా నిర్వహించారు. ఐపంగిడి స్వర్ణాంధ్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు కోణాల శేఖర్ ఉపాధ్యక్షుడు మనల్లి గంగరాజు, కార్యదర్శి మడిచర్ల భద్రం, కాపవరం జై దుర్గా ఆటో యూనియన్ అధ్యక్షుడు వరుగేటి రామారావు, ఉపాధ్యక్షుడు పెద్ద మూర్తి కిరణ్, కార్యదర్శి శంకర్ తదితరులు ఆందోళనకు సారథ్యం వహించారు

తాళ్లపూడి : స్త్రీ శక్తి పథకం పేరుతో ఆటో కార్మికుల ఆర్థిక పరిస్థితుల పై దెబ్బ కొట్టిన రాష్ట్ర ప్రభుత్వం తమ సంక్షేమం కోసం జీవనం మతి కోసం పథకాన్ని ప్రవేశపెట్టి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని లేకపోతే తమకు చావే దిక్కు అని పలువురు ఆటో కార్మికులు అన్నారు. తాళ్లపూడిలోని మూడు ఆటో యూనియన్ చెందిన సుమారు 270 మంది



కొవ్వూరులో నిరసన ర్యాలీలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు

కార్మికులు మంగళవారం పైడిమెట్ట జంక్షన్ వద్ద వంట వార్పు నిర్వహించి నిరసన తెలిపారు. న్యూ యువశక్తి ఆటో యూనియన్ అధ్యక్షులు కడుగుల రజనీ కుమార్, గోదావరి న్యూ చైతన్య ఆటో యూనియన్ అధ్యక్షుడు తమిర్సి మధు బాబు, నవ చైతన్య ఆటో యూనియన్ అధ్యక్షులు హనుమంత పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి కార్యాలయ అధికారి రామకృష్ణ వినతిపత్రం అందజేశారు.

చాగల్లు : చాగల్లు మండల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చాగల్లు మెయిన్ బజార్‌లో జయశ్రీ విజయ దుర్గ ఆటో ఓనర్స్ అండ్ ఆటో డ్రైవర్స్ హెల్పర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆటోడ్రైవర్లు నిరసన తెలిపారు. ఆటో యూనియన్ అధ్యక్షులు ఎమ్‌డి తాజుద్దీన్‌బేగ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా మహిళల కోసం స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సును ప్రారంభించిందన్నారు. ఉచిత బస్సు సర్వీసులు వచ్చినప్పటి నుంచి బేరాలు లేక ఉపాధి కోల్పోయామన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. జిఒ 21ని రద్దు చేయాలన్నారు. ఊనగట్ల ఆటో యూనియన్ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు కంచుమర్తి ధర్మరాజు, అంజిత్ శ్రీనివాస్రావు, మల్లుల మల్లికార్జునరావు, కె.సుబ్రమణ్యం, గోపి తదితరులు పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

క్యాష్ బ్యాగ్ చోరీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మెయిన్ రోడ్‌లోని కుమార్ జ్యువెలరీ షాపు యజమాని క్యాష్ బ్యాగ్‌ను గుర్తు తెలియని వ్యక్తి దోచుకుపోయాడు. షాప్ యజమాని కాకినాడ శివాజీ మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో షాపు మూసివేసి క్యాష్ బ్యాగ్ పక్కన పెట్టి షాపుకి తాళాలు వేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి క్యాష్ బ్యాగ్ పట్టుకొని పరారయ్యాడు. బ్యాగులో సుమారు 2 లక్షలు ఉంటుందని యజమాని తెలిపారు. వెంటనే యజమాని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వి.మౌనిక కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్‌కు జైలు శిక్ష

ప్రజాశక్తి - గండేపల్లి

రోడ్డు ప్రమాద కేసులో డ్రైవర్‌కు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ శివనాగు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలావున్నాయి..కర్ణాటక రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ హుస్సేన్ 2020 మే 10వ తేదీ ఉదయం 7 గంటలకు మురారి జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రయాణికుడు గులివిందల సత్య నారాయణ తీవ్రగాయాలయ్యాయి. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి 11వ తేదీన మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఆయన పిల్లలు జహ్నవి, పార్థు గాయపడ్డారు. అప్పటి ఎస్ఐ టి.తిరుపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో నిందితుడైన హుస్సేన్‌కి జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎల్.దేవీరత్నకుమారి 6 నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరపున ఆకుల లీలా నాగరోజా వాదనలు వినిపించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మల్లేపల్లి గ్రామానికి చెందిన మదపాటి సూరిబాబు(35) రోజువారి పని నిమిత్తం మంగళవారం తాళ్లూరు వెళ్లాడు. తిరిగి వచ్చే క్రమంలో తాళ్లూరుకి-బొర్రంపాలెంకి మధ్య రోడ్డు ప్రక్కన నిలబడిన సూరిబాబును ప్రయివేటు ట్రావెల్ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ యువి.శివనాగబాబు తెలిపారు.

అత్యాచారం కేసు నమోదు

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం గ్రామానికి చెందిన ఒక బాలికపై అత్యాచారం ఘటనకు సంబంధించి కేసు నమోదు చేశామని ఎస్ఐ విఎన్‌వి.పవన్‌కుమార్ తెలిపారు. గోకవరం గ్రామానికి చెందిన మాగపు గాంధీ బాలికను ప్రేమలోకి దింపాడు. తన తల్లిదండ్రులకు పరిచయం చేస్తానంటూ బాలికను ఈ ఏడాది ఆగస్టు 8వ తేదీ ఉదయం 10.30 గంటలు సమయంలో తీసుకెళ్లాడు. గోకవరం గ్రామంలో ఆదిత్య హాస్పిటల్ వెనుక వీధిలోకి తీసుకువెళ్లి అక్కడ ఇంట్లో ఉంచాడు. తినేందుకు బిర్యానీ తీసుకొచ్చేందుకు గాంధీ బయటకు వెళ్లాడు. ఈ సమయంలో గోకవరం గ్రామానికి చెందిన గునిపే కిరణ్ బాలిక ఉన్న గదిలోకి ప్రవేశించి అత్యాచారం చేశాడు. ఈ మేరకు బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి - పెరవలి

బైకు ఢీకొనడంతో గాయపడిన రావులపాలెం మండలం రావులపాడుకు చెందిన మహిళ కొప్పిశెట్టి వెంకయమ్మ(68) పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందింది. వెంకయమ్మ ఈ నెల 8న కడింపాడులో బంధువులను కలిసేందుకు వెళ్లింది. కడింపాడు సెంటర్‌లో దిగి బంధువుల ఇంటికి వెళ్లేందుకు బైపాస్ రోడ్డు దాటుతుండగా బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకయమ్మ తీవ్రంగా గాయపడింది. ఆమెను వెంటనే తణుకులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆమె మంగళవారం మృతి చెందింది. ఆమె కుమారుడు కొప్పిశెట్టి వీరభద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

విద్యుత్ షాక్ గురై వ్యక్తి మృతి చెందిన ఘటన కపిలేశ్వరపురం మండలం పడమర ఖండ్రిక గ్రామంలో మంగళవారం జరిగింది. అంగర పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం .. టేకి గ్రామానికి చెందిన వాసంశెట్టి శ్రీనివాస్(30) పడమరఖండ్రిక గ్రామంలో ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నాడు. పనుల్లో భాగంగా స్లాబ్ సెంటరింగ్ పనుల కోసం ఇనుప ఊచలను బిల్డింగ్ పైకి లాగు తుండగా అక్కడే ఉన్న 11 కెవివిద్యుత్ వైర్లు తగలడంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు.అక్కడే ఉన్న మరో ఇద్దరు వనుం శ్రీను, గుత్తుల శివకృష్ణలకు స్వల్ప గాయాలు కావడంతో కపిలేశ్వరపురం సిహెచ్‌సికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుని భార్య కుమారి ఫిర్యాదు మేరకు ఎస్ఐ హరీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా మృతునికి భార్య కుమారి, 8, 6 సంవత్సరాల కుమారులు ఉన్నారు. చిన్న వయసులోనే శ్రీనివాస్ మతి చెందడం పట్ల గ్రామంలో విషాద ఛాయలు అలుము కున్నాయి.

రూ.1.5 లక్షల ఎరువులు సీజ్

ప్రజాశక్తి - అంబాజీపేట

వ్యవసాయ శాఖ మరియు విజిలెన్స్ మరియు ఎన్‌ఫోర్స్ మెంట్ (రాజమండ్రి) ఆధ్వర్యంలో మాచవరంలో ఎరువుల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. విజిలెన్స్ టీం మరియు మండల వ్యవసాయ అధికాధికారి ఎ.ధర్మ ప్రసాద్ శ్రీ సుభాష్ ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి చేశారు. ఈ తనిఖీల్లో 5.20 మెట్రిక్ టన్నులు రూ.1 లక్షా 15 వేల 370 విలువైన సరుకు సీజ్ చేసి జెసి కోర్టుకు సమర్పించామని ఎఒ తెలిపారు.ఈ తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్‌పి ఎస్.తాతారావు (రాజమండ్రి), డిసిటిఒఎమ్.నవీన్ కుమార్, కానిస్టేబుల్ శివకుమార్, ఎఇఒ జాబెజ్ శాస్త్రి పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రస్తుత సమాజంలో పోటీ పడాలంటే విద్యార్థి దశ నుండే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాని నీతి అయోగ్ జాతీయ స్థాయి మెంటర్ ఎస్.గంగాధర్‌శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని రాజంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సృజనాత్మక శాస్త్రీయ దృక్పథానికి పదును పెడితే నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపే ఆలోచనలు వారిని బావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దుతాయన్నారు. ఆసక్తిని రేకెత్తించే లక్ష్యంతో సైన్స్ ప్రదర్శన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వదేశీ పరిజ్ఞానం ద్వారా మన సమస్యలకు మనమే పరిష్కార మార్గాలు కనిపెట్టుకోవాలన్నారు. మేడిన్ ఇండియా, స్కిల్ ఇండియా, స్కూల్ ఇండియా, యువ శాస్త్రవేత్తలుగా యువ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి సైంటిఫిక్ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏ దేశ ఆర్థిక ప్రగతి అయిన ఆ దేశ శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిపై ఆధార పడి ఉటుందన్నారు. ఆ దిశగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇదే హైస్కూల్లో చదివిన పూర్వ విద్యార్థి వైష్ణవు లక్ష్మీనారాయణ ఫిన్ టెక్ ఎన్నారై సంస్థలో వెబ్ మేనేజర్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు. ఆయన



అవగాహన కల్పిస్తున్న గంగాధర్‌శ్రీనివాస్

సైంటిఫిక్ స్టూడెంట్స్.కామ్ అనే సైన్స్ వెబ్‌సైట్‌ను రూపొందించారన్నారు. అది పిల్లలు శాస్త్రవేత్తలుగా, తగినంత ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. హెచ్‌ఎం మడిచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచి కలిగించి సృజనాత్మకతను వెలికి తీయడానికి భావితరాలకు శాస్త్రవేత్తలు ఎదగడానికి ఈ కార్యక్రమం ప్రేరణనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మడిచర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు డి.శేషారత్నం, విజయకుమారి, షేక్ వలీ, మద్దాల నాగేశ్వరరావు తదితరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా కేటాయింపునకు కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

యూరియా కేటాయింపులకు జెసి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమన్వయ శాఖల అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కమిటీలో వ్యవసాయ, సహకార, ఉద్యాన, పశుసంవర్ధక శాఖాధికారులు, మార్క్‌ఫెడ్ డిఎం సభ్యులుగా ఉంటారని చెప్పారు. ఎంత యూరియా అవసరమో కమిటీ సిఫార్సు చేస్తుందన్నారు. ఆ మేరకు కేటాయింపులు జరుగుతాయని వివరించారు. కేటాయింపు తరువాత నిల్వలను సహాయ రిజిస్ట్రార్ తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రం వారీగా రికార్డులు సక్రమంగా


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

నిర్వహించాలని సూచించారు. యూరియా నిజంగా రైతు సేవా కేంద్రాలకు చేరిందా లేదా వ్యవసాయ అధికారి పరిశీలించాలన్నారు. సరఫరా చేసిన యూరియా వినియోగాన్ని వ్యవసాయ సహాయకులు తనిఖీ చేసి, కనీసం 10 శాతం క్షేత్ర స్థాయిలో నిర్ధారణ జరపాలని ఆదేశించారు. అలాగే ఒక రైతు సేవా కేంద్రం నుంచి మరొక కేంద్రానికి యూరియాను తరలించాలంటే సంబంధిత మండల వ్యవసాయ అధికారి అనుమతి తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. రాబోయే రబీ పంట కాలంలో ఉద్యాన పంటలకు కూడా యూరియా అవసరమవుతుందని, ఈ మేరకు ముందస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా సహకార శాఖ అధికారి ఎం.వెంకటరమణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎస్.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో ఎన్ఐసియు ఏర్పాటు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం జిజిహెచ్‌లో ఎన్ఐసియు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని, ఈ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిజిహెచ్ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. కొత్త విభాగాల ఏర్పాటు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుధ్య పరిరక్షణ వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిజిహెచ్ లేఅవుట్ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆసుపత్రి ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ఆర్చ్ నిర్మించాలన్నారు. ఆసుపత్రికి ఒకటి లేదా రెండు మాత్రమే ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిగిలిన మార్గాలను బారికేడ్లతో మూసివేయాలని సూచించారు. ఆసుపత్రిలో శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చోరీలను అరికట్టడానికి ఆసుపత్రిలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. లోనికి వచ్చే వారి, బయటకు వెళ్లే వారి వివరాలు తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని భద్రతా సిబ్బందిని ఆదేశించారు.

ఆసుపత్రి ఆవరణలో శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చివేసి ఖాళీ స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అవుట్ పేషెంట్ సేవలు సమయానికి ప్రారంభమయ్యేలా టోకెన్ కౌంటర్లు పెంచాలన్నారు. న్యూరో సర్జరీ విభాగానికి అవసరమైన పరికరాలు అందుబాటులో ఉన్నందున తాత్కాలికంగా సాంకేతిక నిపుణులను నియమించి, ఆ మేరకు సేవలు అందుబాటులోకి తీసుకుని రావాలన్నారు. సిఎస్ఆర్ నిధులతో ఎన్ఐసియు పరికరాలను అందిస్తామని తెలిపారు. ఆసుపత్రి తరపున మానవ వనరులు సమకూర్చి త్వరలో ఎన్ఐసియు సేవలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే మృతదేహాలను తరలించడానికి మహా ప్రస్థానం వాహనాలతో పాటు ప్రైవేటు వాహనాలను కూడా ఎంపానెల్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్య అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిజిహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్‌రెడ్డి, జిజిహెచ్ ఆర్‌ఎం డాక్టర్ ఆర్‌విజుసుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరుకు తరలిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి-గోకవరం

పెద్దాపురం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన 'అన్నదాత పోరు' కార్యక్రమానికి మండలానికి చెందిన వైసిపి శ్రేణులు వెళ్లాయి. వైసిపి పంచాయతీ రాజ్ విభాగం జాయింట్ సెక్రటరీ సుంకర వీరబాబు ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లారు. అనంతరం వైసిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజా సమక్షంలో ఆర్‌డిఒకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి అక్షింతల రాజా, వైసిపి నాయకులు నరాలశెట్టి నరసయ్య, అంబటి అబ్రహం, నండూరి గోపిభాస్కర్, పాటి వివేక్, బొడ్డపాటి వీరచంద్ర, పాలిక కుమార్, గూడుపు చిన్న, సిహెచ్‌వి.పద్మరాజు, వైసిపి కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి - పెరవలి

ఖండవల్లి గ్రామానికి చెందిన వివాహిత పెచ్చెట్టి జ్యోత్స్న అదృశ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. వినాయక చవితి పండుగకు ఖండవల్లిలో ఆమె పుట్టింటికి వచ్చింది. అప్పటి నుంచి ఖండల్లిలోనే ఉంటోంది. ఈ నెల 8న ఇంటి నుంచి కుమార్తె అదృశ్యమైంది. ఈ మేరకు తల్లి వనచర్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె వివరాలు తెలిసిన వారు 9440796642 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీ కొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

లారీ ఢీ కొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తాణేలంక, పళ్ళవారిపాలెం వెళ్లే ఆర్అండ్‌బి ప్రధాన రహదారిపై రాజుపాలెం వద్ద మంగళవారం కొబ్బరి డొక్కల లోడుతో వెళ్తున్న హైజర్ లారీని తప్పించ బోయి మోటారు సైకిల్ పై వెళ్తున్న కూనలంక గ్రామానికి చెందిన కొప్పిశెట్టి గంగా రాజు(45) లారీ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు.దీనిపై ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేశారు.

మానవతా శాంతి రథం ప్రారంభం

చాగల్లు : మండలంలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ శాంతిరథం సేవలను మంగళవారం నుంచి ప్రారంభించింది. మానవత వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సుంకవల్లి సీతాపతి కుటుంబ సభ్యులు సహకారంతో దీన్ని ప్రారంభించారు. చాగల్లు-కొవ్వూరు మానవత నిర్వహణలో తన సేవలు అందిస్తుందని ట్రస్ట్ అధ్యక్షులు జుజ్జువరపు వెంకటకృష్ణ ప్రసాద్ తెలిపారు. అవసరమైన వారు 7382151960, 9705436381, 9490511359 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ ప్రసాద్

యూరియా అధిక వాడకం అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అధిక యూరియా వాడకం వల్ల కలిగే అనర్థాలను స్వయం సహాయక సంఘాల మహిళలు రైతులకు వివరించాలని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ సూచించారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో తహశీల్దార్ అధ్యక్షతన అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బి.రాజారావు మాట్లాడారు. రైతులు భూసార పరీక్షలకు అనుగుణంగా అవసరం మేర మాత్రమే రసాయనిక, సేంద్రీయ, జీవన ఎరువులను వినియోగించాలన్నారు. తద్వారా నేల సారవంతంగా ఉంటుందన్నారు. దిగుబడులు కూడా పెరిగి రైతుకు లాభదాయకంగా ఉంటుందన్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా జీవ ఎరువులు, నానో ఎరువులు వాడకాన్ని పెంచేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంవిఎస్ఎస్.మూర్తి, ఎపిఎం బాల కోటయ్య, వివిధ గ్రామాల మహిళలు పాల్గొన్నారు.